క్లుప్తంగా

స్వాతంత్య్ర సమరయోధునికి సన్మానం



మంగళగిరి: నియోజకవర్గంలోని దుగ్గిరాల మండలం ఈమనిలో మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 107 సంవత్సరాల స్వాతంత్య్ర సమరయోధుడిని ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన సంకా పూర్ణచంద్రరావును పంచాయతీ కార్యాలయంలో సన్మానించి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉజ్వల శ్రీహరి వాణి సిద్దెల, కార్యదర్శి బి.సతీష్ బాబు, పంచాయితీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



మంగళగిరి: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కార్పొరేషన్ పరిధి నూతక్కిలో సోమవారం మానవహారం నిర్మించారు. బాపట్ల తెలుగు బాప్టిస్ట్ పాస్టర్స్, స్త్రీల సమాజం, సీయోను తెలుగు బాప్టిస్టు చర్చి, నూతక్కి సంఘ విశ్వాసులు క్రైస్తవులతో కలసి నూతక్కి బాప్టిస్టు చర్చి వద్ద నుంచి వైఎస్సార్ సెంటర్ వరకు మానవహారం నిర్మించి మణిపూర్ ప్రజలకు సంఘీభావం తెలిపారు.

విద్యార్థులకు నగదు పారితోషికాలు



మంగళగిరి: తాడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. డాక్టర్ వైఎస్సార్, కేవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకులు కళ్లం రాజశేఖరరెడ్డి సోమవారం పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. తొలుత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఇదే పాఠశాల నుంచి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్ కోర్సుల్లో సీట్లు సంపాదించుకునే విద్యార్థులకు రూ. లక్ష నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తామన్నారు. హెచ్‌ఎం తాతిరెడ్డి, స్థానిక నాయకులు గాంధీ, రుక్మాంగరెడ్డి పాల్గొన్నారు.

ప్రేమ నివాస్ కార్యాలయం ప్రారంభం

మంగళగిరి: రాష్ట్రంలో అనాథలు, దివ్యాంగులకు తమ వంతు సహకారం అందించేందుకే ది ప్రేమ నివాస్ కార్యాలయం (డిజైబుల్డ్ అండ్ అర్బన్ వెల్ఫేర్ అసోసియేషన్) ను ప్రారంభించినట్లు వ్యవస్థాపకులు ఫాదర్ కెఎస్ జోసెఫ్, పాస్టర్ వసంతరావు తెలిపారు. ఫాదర్ థామస్ ఆశయాలతో ముందుకు సాగుతామన్నారు. 1976లో ఫాదర్ థామస్ స్థాపించిన డాన్‌బాస్కో ప్రేమ నివాస్ ఎంతో మంది అనాథలు, దివ్యాంగులకు ఆశ్రయం కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. మంగళవారం యర్రబాలెం మౌర్యా దాబా వెనుక కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రేమ నివాస్ ప్రతినిధులు కేపీ యలమంద, ఈపూరి రిషీంద్ర బాబు, కట్టా ప్రకాష్, నాగమల్లేశ్వరి, కోన శ్రీను, వర ప్రసాద్, ఈపూరి రాజారత్నం, మున్నంగి శ్రీను,కోటయ్య పాల్గొన్నారు.

మేడికొండూరులో చోరీ

8 సవర్ల బంగారం, నగదు అపహరణ

మేడికొండూరు: మండల కేంద్రం మేడికొండూరులో మంగళవారం తెల్లవారుజామున ఒక ఇంటో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి 8 సవర్ల బంగారం, కొంత నగదు అపహరించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. మేడికొండూరుకు చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఇంటి ప్రధాన ద్వారం గాలికోసం తెరిచి నిద్రిస్తున్నారు. అర్థరాత్రి సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి గోడ దగ్గరగా ఉన్న బీరువా తాళాలు తీసుకుని బీరువా తెరిచి 8 సవర్ల బంగారం, కొంత నగదు అపహరించారు. అనంతరం బీరువా తలుపులు మూసి తాళాలు యథావిధిగా తగిలించి వెళ్లిపోయారు. తెల్లవారిన తరువాత ఇంటి యజమాని గుంటుపల్లి నాగేశ్వరరావు కుటుంబీకులు బీరువా తెరిచి చూడగా అందులో ఉండవలసిన బంగారం, నగదు కనబడకపోవడంతో దొంగతనం జరిగిందని భావించి, మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగతనం జరిగిన ఇంటిని ఎస్‌ఐ మధుపవన్ పరిశీలించారు. కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం సభ్యులు వేలు ముద్రలు సేకరించారు.



తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి



ఫిరంగిపురంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, జెడ్పీటీసీ కత్తిరేణమ్మ



జాతీయ గీతాలాపనలో పాల్గొన్న అతిథులు, వీఐటీ ఏపీ యూనివర్సిటీ సిబ్బంది

ఊరువాడా త్రివర్ణ శోభితం

- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవం
- పలు చోట్ల జాతీయ జెండాలను ఎగురవేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. నగరంలోని తహసీల్దార్ కార్యాలయం, నగరపాలక సంస్థ కార్యాలయం, మార్కెట్ యార్డు కార్యాలయాల్లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేసి చిన్నారులకు, విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవ గొప్పతనాన్ని వివరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహనీయులు, త్యాగధనులు చేసిన త్యాగం కారణంగా స్వాతంత్య్రం సాధించుకున్నామన్నారు. దేశం అంటే మట్టి కాదోయ్.. దేశం అంటే మనుషులోయ్.. అని మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ సూచించిన సత్యం, అహింస మార్గాల్లో నడిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి బద్ధులమై ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులను, ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను ఎమ్మెల్యే ఆర్కే సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు సంకె సునీత, కలకోటి స్వరూపారాణి, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, కమిషనర్ యు.శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

వైఎస్సార్ సీపీ తాడేపల్లి కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. పార్టీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి తాడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విజయకీలాద్రిపై జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో అహోబిళ రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో సంస్థ ఎండీ అంబేడ్కర్ త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈడీ సి నాగరాజు, అధికారులు శివకుమార్ రాజు, శాంతి స్వరూప్, ఎన్‌ఎం అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో...

నగరంలోని ఎయిమ్స్‌లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి జాతీయ జెండాను ఎగురవేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారి ఆధ్వర్యంలో నగరపరిధిలోని చినకాకాని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, పారేపల్లి నిరంజన గుప్తా, మున్నంగి వివేకానందరెడ్డి, పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్లు , ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేసి విద్యార్థులకు మిఠాయిలను పంచిపెట్టారు. నగరంలోని సచివాలయాల్లో, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో, విలేజీ హెల్త్ సెంటర్లలో స్వాతంత్య్ర దినోత్సవ వేడులను నిర్వహించారు. నగరంలోని రాజీవ్ సెంటర్‌లో వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించి వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌లో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకల్లో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరావు జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో...

నగరంలోని ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్ ఆవరణలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి సందేశాన్ని ఇచ్చారు. అడిషల్ కమాండెంట్ వీఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు దేవానంద్, శ్రీనివాస బాబ్జి, మల్లిఖార్జునరావు, డీఎస్పీ మురళీ కృష్ణలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతీయ జెండాను జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ ఎగురవేశారు. మండల అధ్యక్షుడు ఎం.శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, కె.చిన్నప్పరెడ్డి, జి.చంద్రం, మేడాబాబు, డి.మెల్కియా, బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ జాతీయజెండాను ఎగురవేశారు. గాంధీచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, ఎస్,.సంధ్యారాణి, చిట్టా బాపూజీరెడ్డి, షేక్ సలీం, సత్యం, శివరామిరెడ్డి, బుచ్చిరెడ్డి, నాగిరెడ్డి, ఇ.శ్రీనివాసరెడ్డి, షేక్.ఖాసిం షాహిద్, ఎంపీడీవో డి.అనూరాధ, ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీ, శౌరీలు, ఎస్.నాగరాజులు పాల్గొన్నారు. సెయింట్‌ఆన్స్ పాఠశాలలో జాతీయ జెండాను ఎగుర వేసి, విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం సిస్టర్ థెరసమ్మ, సిస్టర్ విన్సి, మరియ రాణి, ఇన్నారెడ్డి పాల్గొన్నారు. బేతపూడిలో జాతీయ జెండాను సర్పంచ్ సర్పంచ్ జి. ఆదం బీ ఎగురవేశారు. స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో జాతీయజెండా ఎగురవేసి, విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మనాభుడు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

మంగళగిరి: నియోజకవర్గంలో దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 77వ స్వాతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి జాతీయ జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ మేకతోటి అరుణ, సర్పంచ్ బాణావత్ ఖుషీ బాయ్, ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంఈవోలు కాజ శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

నగరంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవంలో సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజు జాతీయ జెండాను ఎగురవేసి సందేశాన్నిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి రామకృష్ణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూషా, బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.లెనిన్‌బాబు, బి.నాయుడమ్మ,అడిషనల్ పీపీ రేటూరి కిషోర్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. నగరంలో వీవర్స్ కాలనీలోని వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం నిర్వహించారు. తొలుత చేనేత ప్రముఖుడు దామర్ల రమాకాంతరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. నగర పరిధిలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగిన వేడుకలలో వీసీ డాక్టర్ మనోజ్‌కుమార్ అరోరా జాతీయ జెండా ఎగురవేశారు. రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేఎల్ యూనివర్సిటీలో జరిగిన వేడుకలలో వీసీ డాక్టర్ పి.పార్థసారధి వర్మ జాతీయ జెండా ఎగురవేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రో వీసీ కేఎస్ జగన్నాథరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్ పాల్గొన్నారు.

వీఐటీ – ఏపీలో..

ఐనవోలు(తాడికొండ): తుళ్ళూరు మండలం వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈవీపీ అండ్ గ్లోబల్ హెడ్ జితేంద్ర చక్రవర్తి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇద్దరికి, మున్సిపల్ కార్మికులు–2, వైద్య సిబ్బంది–2 మొత్తం ఆరుగురికి రూ.25 వేలు చొప్పున నగదు పారితోషికం అందజేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కె ఖాదిర్ పాషా పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడికొండూరులో...

మేడికొండూరు: మండలంలోని పలుగ్రామాలలో 77వ స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన పతాకావిష్కరణలో తూళ్ళూరు డీఎస్పీ పోతురాజు, సీఐ కె.వాసు పాల్గొన్నారు. డోకిపర్రు గ్రామ సచివాలయంవద్ద జరిగిన వేడుకల్లో జడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, గ్రామ సర్పంచ్ కొండెపోగు సాంబ్రాజ్యం పాల్గొన్నారు. పేరేచర్ల జంక్షన్ భాసర స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆవుల సుబ్బారావు జెండా ఎగురవేసి, స్వాతంత్య్ర వీరుల గురించి తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పేరేచర్లలో గ్రామసర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్ జెండావిష్కరణ చేశారు. తాళ్ళూరి వంశీకృష్ణ, చిట్టినేని శ్యాము, ముత్యాల బాస్వామి పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



ప్రకృతి విపత్తుల సంస్థ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎండీ అంబేడ్కర్



మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో జెండా వందనం చేస్తున్న డీఎస్పీ పోతురాజు



దుగ్గిరాలలో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ



కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఎగురవేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి



తాడికొండలో జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



తాడికొండ ఎంపీడీఓ కార్యాలయంలో ..

తాడికొండ: స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడికొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ చిమటా పూర్ణచంద్ర రావు యార్డు సిబ్బంది, డైరెక్టర్లతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి, తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కాకుమాను ప్రసాద్, తాడికొండ పోలీస్ స్టేషన్‌లో సీఐ గన్నవరపు శ్రీనివాసరావు, తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం ఆనంద రావు, రాయపూడి సీఆర్డీయే సర్కిల్ విద్యుత్ కార్యాలయంలో ఎస్ఈ పి.విజయ్ కుమార్, తుళ్ళూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో బి శివన్నారాయణ, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పి వసంతరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

- తాడికొండలో ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, వలంటీర్లు, 108 సిబ్బంది, యానిమేటర్లకు బియ్యం, దుస్తులు పంపిణీ
- దాత బెజ్జం సాయిప్రసాద్‌కు ప్రభుత్వ సలహాదారు బత్తుల, సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌ల అభినందనలు



పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్, బెజ్జం సాయిప్రసాద్

తాడికొండ: సాటివారికి సాయంచేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో వైఎస్సార్ సీపీ నాయకుడు బెజ్జం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో షిర్డీసాయి బాబా ఆలయ ప్రాంగణంలో ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు, 108 సిబ్బంది, యానిమేటర్లకు దుస్తులు, బియ్యం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్‌కుమార్‌లు మాట్లాడుతూ సాటివానికి సేవ చేయడం, సహాయ పడటంలో ఆత్మ తృప్తి ఉంటుందని, నిత్యం పేదలకు సాయం అందిస్తున్న బెజ్జం సాయిప్రసాద్ పేదల గుండెల్లో ఉంటారన్నారు. 75 సంవత్సరాల స్వతంత్య్ర భారతదేశ చరిత్రలో ఏపీలో పేదలను ఆర్థికంగా స్థితిమంతులను చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం అతిథుల చేతుల మీదుగా బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. కరోనా సమయంలో పలుమార్లు పేదలకు నిత్యావసరాలు ఇతర సాయం అందించిన బెజ్జం సాయిప్రసాద్‌ను ఈ సందర్భంగా అతిథులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, యార్డు వైస్ చైర్మన్ బోయపాటి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి, శృంగారపాటి సందీప్, మాజీ సొసైటీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, పార్టీ గ్రామ అధ్యక్షుడు షేక్ జుబేర్, జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి తోకల నరసింహారావు పాల్గొన్నారు.

బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను విస్మరించిన లోకేష్

- విగ్రహాలకు పూలమాల వేయాలని కోరిన టీడీపీ ఎస్సీ నాయకులు
- పట్టించుకోకుండా ముందుకు సాగిన లోకేష్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎస్సీ నాయకులు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నిడమర్రు నుంచి మంగళవారం లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. నిడమర్రు నుంచి మంగళగిరికి వచ్చే రోడ్డుతో పాటు మరో చోట భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉండటంతో స్థానిక ఎస్సీ నాయకులు ఆ విగ్రహాలకు లోకేష్ చేత పూలమాలలు వేయించాలని ఏర్పాట్లు చేశారు. శిబిరం వద్ద పలువురు నాయకులు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వేచి ఉండి పూలమాలలు సిద్ధం చేశారు. లోకేష్ అక్కడికి వచ్చేటప్పటికీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయాలని కోరగా లోకేష్ వారిని పట్టించుకోకుండా ముందుకు సాగడంతో ఎస్సీ నేతలు అవాక్కయ్యారు. కనీసం వారి చేతుల్లోని వినతిపత్రాలను కూడా స్వీకరించకుండా వెళ్లడం వారిని ఆగ్రహానికి గురి చేసింది. లోకేష్ తండ్రి చంద్రబాబు ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని ఎస్సీలను అవమానించగా.. నేడు లోకేష్ అంబేడ్కర్ విగ్రహాలను పట్టించుకోకుండా ఎస్సీలపై వారికి ఉన్న వ్యతిరేకతను మరోసారి చాటుకున్నారని పలువురు దళిత నేతలు వాపోయారు.

కూలిన టీడీపీ భారీ హోర్డింగ్

మంగళగిరి: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డుపై పాత బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ మంగళవారం అకస్మాత్తుగా రోడ్డుపై కూలిపడింది. అయితే అటు వైపు వాహనదారులు, ప్రజలు ఎవరూ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

జన సైనికుల పిల్ల చేష్టలు

జాతీయ జెండాకు అవమానం



మంగళగిరి: నగరంలోని జాతీయ రహదారి పక్కనగల జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసైనికుల పిల్ల చేష్టలతో జాతీయ జెండాకు అవమానం జరిగింది. జనసేన పార్టీ జెండాతో పాటు జాతీయ జెండాను కలిపి కార్లకు కట్టడంతో పాటు జనసైనికులు రోడ్డుపై జెండాలతో విహరించడం చూసిన స్థానికులు విస్తుపోయారు. జాతీయ జెండాకు అవమానం జరుగుతున్నా నాయకులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.